క్లుప్తంగా

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

గార్లదిన్నె: సంక్రాంతి సందర్భంగా కోడి పందేలను నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ సాగర్ తెలిపారు. గ్రామాల్లో జూదాలు నిర్వహిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. శాంతియుత వాతావరణంలో పండుగ జరుపుకోవాలన్నారు.

యల్లనూరు: తిమ్మంపల్లి, కొడవండ్లపల్లి, బుక్కాపురం, అచ్యుతాపురం, వాసాపురం గ్రామాల్లో ఎస్‌ఐ రామకృష్ణ బుధవారం పర్యటించారు. కోడి పందేలు నిర్వహించినా, జూదం ఆడినా జైలుకు పంపుతామని హెచ్చరించారు. అదేవిధంగా వాహనాల తనిఖీ చేపట్టారు. రికార్డులు సరిగా లేని వాహనదారులకు జరిమానా విధించారు.

నేటి నుంచి సెలవులు

బుక్కరాయసముద్రం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు గురువారం నుంచి 18వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం సంక్రాంతి సెలవులు ప్రకటించిందని ఎంఈఓ గురుప్రసాద్ తెలిపారు. 19వ తేదీ నుంచి పాఠశాలలు పునః ప్రారంభమవుతాయని తెలిపారు. పిల్లలు చెరువులు, కుంటల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

చందనలో వైద్య సేవలు


వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం

యాడికి: ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం చందన గ్రామంలో 60 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు రాయలచెరువు పీహెచ్‌సీ వైద్యాధికారి దేవరాజన్ తెలిపారు.

పుప్పాలలో పొలం బడి

యాడికి: పుప్పాల గ్రామంలో ఏఓ మహబూబ్ బాషా బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వేరుశెనగ పంట సాగుపై రైతులకు సలహాలు ఇచ్చారు. పూత దశలో జిప్సం వేస్తే ఊడలు బాగా దిగి నాణ్యమైన విత్తనాలు ఏర్పడి మంచి దిగుబడి పొందవచ్చన్నారు.

నేత్రపర్వంగా గ్రామోత్సవం


అండాళ్ అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు

తాడిపత్రి టౌన్: స్థానిక శ్రీచింతల వెంకటరమణస్వామి ఆలయంలో బుధవారం ఆండాళ్ అమ్మవారి గ్రామోత్సవం ఘనంగా జరిగింది. ధనుర్మాస వ్రతం ఆచరించిన మహిళలతో అమ్మవారికి కుంకుమార్చన, తులసీదళాలతో పూజలు చేయించారు. అనంతరం ఆలయ ఆవరణలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. ఆలయ కమిటీ చైర్మన్ బాణా నాగేశ్వర రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

యల్లనూరు: కల్లూరు, దుగ్గుపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను తాడిపత్రి క్లస్టర్ ఏపీడీ వెంకటరత్నం బుధవారం తనిఖీ చేశారు. మస్టరు వారిగా పేర్లు పిలిచి హాజరు వేశారు. ప్రతి కుటుంబానికి 100 రోజులు పనిదినాలను కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో రామచంద్రారెడ్డి, ఏపీవో షబ్బీర్‌బాషా, ఈసీ బబ్లు పాల్గొన్నారు.

కుప్పకూలి వ్యక్తి మృతి

గుత్తి: కోట వీధికి చెందిన హారున్ అనే హోటల్ నిర్వాహకుడు (59) బుధవారం తన ఇంటి వద్ద ఉన్నఫళంగా కుప్పకూలాడు. ప్రభుత్వాసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గుండెపోటుతో మృతి చెంది ఉండవచ్చునని చెప్పారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

బాలోత్సవాలను విజయవంతం చేయండి

గుత్తి: అనంతపురంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఈ నెల 27, 28, 29వ తేదీల్లో నిర్వహించే పిల్లల పండుగ(బాలోత్సవాలు)లో పాల్గొని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్ పిలుపునిచ్చారు. బాలోత్సవాలకు సంబంధించిన బుక్‌లెట్‌ను బుధవారం ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ రవినాయక్ విడుదల చేశారు.

నేడు గడప గడపకూ..

పామిడి: పామిడిలోని 3వ వార్డులో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గుంతకల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పాల్గొంటారని తెలిపారు.

ఫారెస్ట్ అధికారులకు దుంగల అప్పగింత

పెద్దవడుగూరు: కాశేపల్లి టోల్‌ప్లాజా వద్ద సోమవారం పట్టుబడిన దుంగలను బుధవారం గుత్తి అటవీశాఖ అధికారి మాధవికి అప్పగించినట్లు ఎస్‌ఐ రాజశేఖరరెడ్డి తెలిపారు. దుంగలను తరలిస్తున్న వారి వివరాలను రాబడుతున్నట్లు పేర్కొన్నారు. కాగా, అటవీ శాఖ అధికారులకు స్వాధీనం చేసిన 43 దుంగలు ఎర్రచందనానికి సంబంధించినట్లుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే వాటిని తుమ్మ దుంగలుగా అటవీ అధికారులు పేర్కొన్నట్లు సమాచారం.

జగనన్నది జనరంజక పాలన

- సీఎంగా వైఎస్ జగన్‌ను మరోసారి ఆశీర్వదించండి
- ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి


ప్రజలకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

పామిడి: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సీఎం వైఎస్ జగన్ జనరంజక పాలన సాగిస్తున్నారని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి అన్నారు. పామిడిలోని 3వ వార్డులో బుధవారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. నాయీబ్రహ్మణవీధి, వీకే ఆదినారాయణరెడ్డి, చైతన్యకాలనీ, వెంగమనాయుడు కాలనీల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి మూడున్నర సంవత్సరాలుగా ఆయా కుటుంబాలకు అందిన పథకాలను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాసంకల్పయాత్రలో ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని హామీలను సైతం నెరవేరుస్తూ సీఎం జగన్ జనరంజక పాలన సాగిస్తున్నారన్నారు. మోసపూరిత వాగ్దానాలిచ్చిన చంద్రబాబునాయుడు, ఆయన ప్యాకేజీ పుత్రుడు పవన్ కళ్యాణ్‌కు ప్రజలు బుద్ధిచెప్పే రోజులు దగ్గరపడ్డాయన్నారు. అన్నివర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న వైఎస్ జగన్‌ను మరోసారి సీఎంగా ఆశీర్వదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ జానకిరామిరెడ్డి, మండల కన్వీనర్ కే నారాయణరెడ్డి, గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి, పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్.మధుసూదన్‌రెడ్డి, చుక్కలూరు రామకృష్ణారెడ్డి, ముస్లిం మైనార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు బీ.ఆసిఫ్, ఓసీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమ్మెత లక్ష్మి, బీసీ సెల్ పట్టణ కన్వీనర్ నగేష్, బీకే అన్వర్‌బాషా, 3వ వార్డు ఇన్‌చార్జ్ సీ అబ్దుల్‌రజాక్, కే మహబూబ్‌బాషా, అబుసాలేహా, అనుంపల్లి సూరి, బోయ రామచంద్ర, రామ్‌నాథ్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, పార్వతీశ్వర్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మూలి నాగేశ్వరరెడ్డి, కృష్ణారెడ్డి, జనార్దన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, కుమార్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, రామచంద్రారెడ్డి, వెంకటసాయి గుప్తా, చాకలి సుంకన్న, తంబళ్లపల్లి వెంకట్రామిరెడ్డి, షెక్షావలి, ఆదాంఖాన్, ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్, సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ముచ్చటగొలిపే ముగ్గులు


ముగ్గులను పరిశీలిస్తున్న గుంతకల్లు మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని


తాడిపత్రిలో ముగ్గులు వేస్తున్న యువతి

గుంతకల్లుటౌన్: జగనన్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా మున్సిపల్ కౌన్సిల్ సహకారంతో మెప్మా ఆధ్వర్యంలో బుధవారం 21,27,16,17,32,37 వార్డుల్లో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అందమైన రంగవల్లులను తీర్చిదిద్దారు. ఈ ముగ్గులను మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని పరిశీలించి విజేతలైన మొదటి ముగ్గురికి కౌన్సిలర్ల సహకారంతో బహుమతులను అందజేశారు. 37 వార్డుల్లో గెలుపొందిన మొదటి ముగ్గురితో కలిపి మొత్తం 111 మందికి ఈ నెల 13వ తేదీన మున్సిపల్ ఆఫీసు వద్ద ఫైనల్ పోటీలను నిర్వహించనున్నట్లు చైర్‌పర్సన్ తెలియజేశారు. కౌన్సిలర్లు వై.సుధాకర్, కృపాకర్, అర్షియాబేగం, కె.వి.నాగరత్నమ్మ, మహాలక్ష్మి, కుమారి, మెప్మా టీపీఆర్‌ఓ మోహన్, సీఓలు పాల్గొన్నారు.

తాడిపత్రి టౌన్: సంక్రాంతిని పురస్కరించుకొని స్థానిక మెయిన్ బజార్‌లో కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తలుపుల సురేంద్రనాథ్ అధ్యక్షతన బుధవారం ముగ్గుల పోటీలు జరిగాయి. 50 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొని రంగవల్లులు తీర్చిదిద్దారు. సంయుక్త, తులసి, తేజస్వి, వి.సుప్రియ, ఎన్ సుప్రియ, నవ్యశ్రీలకు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాల్గవ, ఐదవ, ఆరవ స్థానాల్లో నిలిచారు. కన్యకా పరమేశ్వరీదేవి ఆత్మార్పణ దినోత్సవం రోజున ఈనెల 23న బహుమతులు పంపిణీ చేయనున్నట్లు సురేంద్రనాథ్ తెలిపారు.

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి

- గుత్తిలో వడ్డే ఓబన్న విగ్రహాన్ని ఆవిష్కరించిన సంఘం నాయకులు


గుత్తిలో వడ్డే ఓబన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

గుత్తి: రేనాటి వీరుడు, తొలి స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని వడ్డెర సంఘం నాయకులు, సముదాయ ప్రజలు బుధవారం ఘనంగా నిర్వహించారు. గుత్తిలోని ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలో వడ్డెర్ల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్డే ఓబన్న విగ్రహాన్ని ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మీదేవి, రాష్ట్ర అధ్యక్షుడు బెల్లంకొండ శ్రీనివాసులు, జాతీయ నాయకుడు ముని మారెప్ప, నరసింహారావు, శ్రీరాములు, తిమ్మన్న చౌహాన్, జాతీయ ఉపాధ్యక్షుడు హనుమంతరామప్ప, శివరుద్రయ్య స్వామి, బాల నరసింహులు ఆవిష్కరించారు. దేశ స్వాతంత్ర్యం కోసం తెల్లదొరలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వడ్డే ఓబన్నను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. వడ్డెర్లను ఎస్సీ జాబితాలో చేర్చాలని నాయకులు డిమాండ్ చేశారు. వెంకట శివుడు, వరదరాజులు, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

యాడికి: మండల కేంద్రంలోని గాంధీ కూడలిలో వడ్డెర కార్మిక సంఘం ఆధ్వర్యంలో వడ్డే ఓబన్న జయంతిని నిర్వహించి ఓబన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఓబన్న చిత్ర పటాన్ని ఊరేగించారు.

గుంతకల్లు: స్థానిక వడ్డెర్ల కల్యాణమండపంలో పట్టణ వడ్డెర్ల సంఘం అధ్వర్యంలో వడ్డే ఓబున్న జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. వడ్డే ఓబన్న జయంతిని ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని నాయకులు డిమాండ్ చేశారు. వల్లపు సుబ్బరాయుడు, వెంకటేష్, ఆదినారాయణ, తిమ్మప్ప, గోవిందు, రాముడు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి


భోజనాన్ని పరిశీలిస్తున్న శ్రీమన్నారాయణ

బుక్కరాయసముద్రం: రెడ్డిపల్లి గ్రామంలోని మండల పరిషత్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని మండల స్పెషలాఫీసర్ శ్రీమన్నారాయణ, ఎంపీడీఓ తేజోత్స్న బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట శాలను, తరగతి గదులను పరిశీలించారు. ఆహార పదార్థాల నాణ్యతపై ఆరా తీశారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని, కోడిగుడ్లు, చిక్కీలు తప్పకుండా ఇవ్వాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి గర్భిణులు, పిల్లలు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహార పంపిణీపై ఆరా తీశారు. ఎంఈఓ గురు ప్రసాద్, ఈఓఆర్డీ దామోదరమ్మ, హౌసింగ్ ఏఈ రాజశేఖర్‌రెడ్డి, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు: మహోన్నతమైన సంస్కృతీ, సంప్రదాయాలను భావి తరాలకు అందించిన స్వామి వివేకానంద అందరికీ ఆదర్శప్రాయుడని ఎస్ఎస్‌జీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్ పేర్కొన్నారు. బుధవారం ఆ కళాశాలలో వివేకానంద జయంతితోపాటు జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన ద్వితీయ సంవత్సర డిగ్రీ విద్యార్థులు వేణుశ్రీ, రిజ్వాన, రాధికలకు బహుమతులను అందజేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు బి.కృష్ణయ్య, పి.శ్రీనివాసులు, అధ్యాపకుడు ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు

గుత్తి: కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చునని గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే, పారిశ్రామికవేత్త కొట్రికె మధుసూదన్ గుప్తా అన్నారు. పట్టణంలోని శ్రీ సాయి డిగ్రీ కాలేజీలో బుధవారం ఫస్టియర్ విద్యార్థులకు నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకుని ఆ లక్ష్య సాధన కోసం సరైన మార్గాలు ఎంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

గుత్తి కోట క్యాలెండర్ల ఆవిష్కరణ


క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీ తలారి రంగయ్య

అనంతపురం సప్తగిరి సర్కిల్: గుత్తి కోట క్యాలెండర్లను అనంతపురం ఎంపీ తలారి రంగయ్య బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. అనంత జిల్లాలో అత్యంత పురాతన చరిత్ర ఉందన్నారు. ప్రపంచ స్థాయిలో గుత్తికి ప్రత్యేకత ఉందన్నారు. గుత్తి కోట పరిరక్షణకు ప్రత్యేక చొరవ తీసుకుంటామన్నారు. గుత్తి కోట అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకుంటాయన్నారు. కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి రాజశేఖరరెడ్డి, నాయకులు మురళీకృష్ణ, మల్లికార్జున రెడ్డి, నవీన్, భాస్కర్ పాల్గొన్నారు.

పశుపోషణపై సూచనలు

బుక్కరాయసముద్రం: పశుపోషణలో జాగ్రత్తలు పాటిస్తే పాలవెల్లువ సాధించవచ్చని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ మాధవి పేర్కొన్నారు. రెడ్డిపల్లి కేవీకేలో బుధవారం పశువుల పెంపకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్త డాక్టర్ మాధవి మాట్లాడుతూ పోషకాలతో కూడిన దాణా ఇవ్వడం వల్ల పాల దిగుబడి పెంచుకోవచ్చన్నారు. గొర్రెలు, పశువుల్లో వచ్చే వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అనంతరం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త సుధారాణి రైతులకు మునగ మొక్కలు పంపిణీ చేశారు. కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ చందన్, నవీన్, ఈస్ట్ నరసాపురం సర్పంచ్ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అడ్డుకుందాం

గుత్తి రూరల్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని చైల్డ్‌లైన్ కో–ఆర్డినేటర్ బాలాజీ అన్నారు. మండలంలోని రజాపురం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ ఉషారాణి అధ్యక్షతన బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాలతో అనర్థాలు జరుగుతాయని, ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే 1098కు సమాచారం అందించాలని విద్యార్థినులకు సూచించారు. అనంతరం ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. చైల్డ్‌లైన్ టీం సభ్యురాలు రామలక్ష్మి పాల్గొన్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు


ఘటన స్థలంలో క్షతగాత్రుడు లక్ష్మణ్ నాయక్

గుత్తి రూరల్: ఊబిచెర్ల గ్రామ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుంతకల్లు మండలం నక్కనదొడ్డి తండాకు చెందిన లక్ష్మణ్ నాయక్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈయన కర్నూలు నుంచి బైక్‌పై వస్తుండగా ఊబిచెర్ల శివారులో ప్రమాదాల నివారణకు పోలీసులు ఏర్పాటు చేసిన డ్రమ్ములను ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని తొలుత గుత్తికి, తర్వాత అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

చిరు వ్యాపారులకు అండగా జగనన్న తోడు


శింగనమలలో జగనన్న తోడు చెక్కు పంపిణీ చేస్తున్న డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి


నార్పలలో మాట్లాడుతున్న జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ


తాడిపత్రిలో రుణ మంజూరు పత్రాన్ని అందజేస్తున్న జెడ్పీటీసీ కురవ రమణమ్మ

- లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

నార్పల: చిరు వ్యాపారుల కష్టానికి తగిన ప్రతిఫలం అందలేదనే వారికి అండగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న తోడు పథకాన్ని తీసుకువచ్చిందని జెడ్పీ వైస్ చైర్మన్ నాగరత్నమ్మ పేర్కొన్నారు. బుధవారం రైతు భరోసా కేంద్రం–4లో నిర్వహించిన జగనన్న తోడు పథకం చెక్కులు పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సీఎం జగనన్న పాదయాత్ర సమయంలో తోపుడు బండ్ల వ్యాపారుల కష్టాలను స్వయంగా చూశారన్నారు. వారికి అండగా ఉండాలన్న ఉద్దేశంతో జగనన్న తోడు పేరుతో పథకాన్ని తీసుకువచ్చి అమలు చేస్తున్నారన్నారు. ఈ పథకం ద్వారా ప్రతి చిరు వ్యాపారికీ షూరిటీ లేకుండానే రూ.పది వేల వడ్డీ లేని రుణం అందుతుందన్నారు. ఈ మొత్తాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. మండల వ్యాప్తంగా కొత్తగా 415 మందికి రూ.41.5 లక్షలు కాగా మొత్తం 1,071 మందికి రూ.2,64,000 లక్షల వడ్డీ రాయితీ మంజూరైందన్నారు. ఎంపీపీ నాగేశ్వరరావు, సొసైటీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, ఎంపీడీఓ దివాకర్, ఈఓఆర్డీ లక్ష్మినరసింహ, ఏపీఎం తిప్పమ్మ, ఎంఎస్ అధ్యక్షురాలు రేఖ పాల్గొన్నారు.

శింగనమల: శింగనమలలోని వైకేపీలో జగనన్న తోడు పథకం కింద చిరు వ్యాపారులకు రూ.10 వేలు చెక్కులను బుధవారం డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న చేపట్టిన సంక్షేమ పథకాలతో మహిళలు ఆర్థికాభివృద్ధి చెందుతున్నారన్నారు. ఎంపీపీ యోగేశ్వరి మాట్లాడుతూ జగనన్న తోడు పథకం కింద అందజేస్తున్న వడ్డీ లేని రుణాలను సద్వినియోగం చేసుకొని, వ్యాపారాలను వృద్ధి చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. కెనరా బ్యాంక్ మేనేజర్ రమేష్, ఎంపీడీఓ నిర్మలాకుమారి, ఏపీఎం నారాయణస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు నగేష్, సీసీలు, యానిమేటర్లు, మహిళలు పాల్గొన్నారు.

తాడిపత్రి టౌన్: స్థానిక వైకేపీ కార్యాలయంలో మెప్మా ఏపీఎం రాజశేఖర్ అధ్యక్షతన బుధవారం జరిగిన కార్యక్రమంలో జగనన్న తోడు పథకం కింద లబ్ధిదారులకు జెడ్పీటీసీ కురవ రమణమ్మ చెక్కులు పంపిణీ చేశారు. ఎంపీడీఓ రంగారావు పాల్గొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 2016 మంది ఎంపిక కాగా తాడిపత్రి మున్సిపాలిటీలో 556 మంది, రూరల్ పరిధిలో 440 మంది, యాడికి మండలంలో 403 మంది, పెద్దపప్పూరు మండలంలో 261మంది, పెద్దవడుగూరు మండలంలో 346 మందికి రూ 2,00,60,000 వారి బ్యాంకు ఖాతాలో జమ అయ్యింది.

బుక్కరాయసముద్రం: మండలంలో జగనన్న తోడు పథకం కింద 655 మంది చిరు వ్యాపారులకు వడ్డీ రాయితీ కింద రూ.1,68,972 మేర లబ్ధి జరిగిందని ఐకేపీ ఏపీఎం మద్దిలేటి తెలిపారు.

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా జగనన్న తోడు పథకం కింద 429 మందికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.42.90 లక్షలు రుణాలు మంజూరైనట్లు ఏపీఎం శ్రీరాములు తెలిపారు. గత ఏడాది 254 మంది జగనన్న పథకం ద్వారా లబ్ధి పొంది రుణాలు సక్రమంగా చెల్లించినందువల్ల ప్రభుత్వం వడ్డీ రాయితీ ద్వారా రూ.55,590 వడ్డీ బ్యాంకు ఖాతాలో జమ అయ్యిందన్నారు.

13 నుంచి షటిల్ పోటీలు

తాడిపత్రి అర్బన్: సంక్రాంతి సందర్భంగా పుట్లూరు రోడ్డు సమీపంలోని రైస్‌మిల్లు ఇండోర్ స్టేడియంలో ఈనెల 13 నుంచి 17 వరకు నియోజకవర్గ స్థాయి షటిల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 13న బాలికలకు (సింగిల్స్), 17న బాల బాలికలకు(డబుల్స్) పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఎంట్రీ ఫీజు ఉండదన్నారు. 9866592868 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

నేరాలు చేయడం మానుకోండి


మాట్లాడుతున్న సీఐ రామసుబ్బయ్య

గుంతకల్లు టౌన్: నేరాల జోలికి వెళ్లకుండా సత్ప్రవర్తనతో మెలగాలని వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య ఇరానీకాలనీ వాసులకు సూచించారు. బుధవారం ఇరానీలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆంధ్ర, ఇతర రాష్ట్రాల్లో గుంతకల్లు ఇరానీ కాలనీవాసులు కొందరు చోరీలకు పాల్పడి క్రైమ్ రికార్డుల్లోకెక్కారన్నారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలన్నారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని జీవితాలను బాగు చేసుకోవాలన్నారు.

సమయ పాలన పాటించాలి

గార్లదిన్నె: కమలాపురం, కొప్పల కొండ గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ విజయ భాస్కర్ బుధవారం తనిఖీ చేశారు. పలు రికార్డులు, సిబ్బంది బయోమెట్రిక్ హాజరును పరిశీలించారు. సమయ పాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ


చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రి టౌన్: వ్యాధులబారిన పడి చికిత్సలు చేయించుకున్న పట్టణంలోని సుంకులమ్మపాలెంకు చెందిన ఇద్దరికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ 2.01 లక్షలు మంజూరైంది. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి బుధవారం బాధితులకు చెక్కులు పంపిణీ చేశారు. కౌన్సిలర్ రంగనాథరెడ్డి, నాయకులు కేశవరెడ్డి, బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ఫ్లెక్సీలు వద్దు

తాడిపత్రి టౌన్ : పోలీసుల అనుమతి లేకుండా మున్సిపాలిటీ పరిధిలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ జబ్బార్‌మియా హెచ్చరించారు. ఫ్లెక్సీల ఏర్పాటుకు తొలుత పోలీసుల అనుమతి తీసుకొని తర్వాత మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. శుభాకాంక్షలు, జయంతి ఉత్సవాలకు సంబంధించిన ఫ్లెక్సీలు మాత్రమే ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇతర మతాల ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా ఫ్లెక్సీలు వేయవద్దని సూచించారు.

డిగ్రీ కాలేజీ మంజూరు చేయాలి

గుత్తి: గుత్తి పట్టణానికి డిగ్రీ కాలేజీ మంజూరు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి చిరంజీవి డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రైవేట్ డిగ్రీ కాలేజీలకు ఫీజులు కట్టలేక పేద విద్యార్థులు డిగ్రీ చదువుకు దూరం అవుతున్నారన్నారు. ప్రభుత్వం డిగ్రీ కాలేజీని ఏర్పాటు చేయాలని కోరారు.

20 బైక్‌ల సీజ్

తాడిపత్రి అర్బన్: డీఎస్పీ వీఎన్‌కే చైతన్య ఆధ్వర్యంలో బుధవారం పోలీసులు వివిధ ప్రాంతాల్లో వాహనాల తనిఖీ చేపట్టారు. ఎటువంటి పత్రాలు, నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న 20 బైక్‌లను సీజ్ చేసినట్లు సీఐ మల్లికార్జున గుప్తా తెలిపారు. ఇటీవల పట్టణంలో చైన్ స్నాచింగ్ ఘటనలు ఎక్కువగా చోటు చేసుకోవడంపై జిల్లా ఎస్పీ ఫక్కీరప్ప తీవ్రంగా స్పందించినట్లు తెలిసింది. దీంతో పోలీసులు తనిఖీలు నిర్వహించినట్లు సమాచారం.

ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ


వెంకట ప్రసాద్

పుట్లూరు: మండల ఎస్‌ఐగా వెంకటప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నార్పల నుంచి బదిలీపై పుట్లూరు వచ్చారు.

కందిలో పంటకోత ప్రయోగాలు

శింగనమల: తరిమెల, కొరివిపల్లి గ్రామాల్లో బుధవారం వ్యవసాయ శాఖ అధికారులు కందిలో పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. తరిమెలలో 10 మీటర్ల పరిధిలో పంట కోత ప్రయోగాలు చేపట్టగా 4.7 కేజీలు, కొరివిపల్లిలో 4.010 కేజీలు వచ్చినట్లు ఏఓ చిన్నమ్మ తెలిపారు. ఈఓ అక్కమ్మ పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

పెద్దవడుగూరు : స్థానిక జడ్పీ హెచ్ పాఠశాలకు చెందిన 1987–88 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు బుధవారం ఒక్కచోట చేరి సందడి చేశారు. మండల కేంద్రంలోని దివాకర్ ఫంక్షన్ హాలులో సమావేశమై ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆప్యాయంగా పలుకరించుకున్నారు. అనంతరం అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు.

ఆ స్థలం పంచాయతీదే

నార్పల: మండల కేంద్రంలోని చింతవనం కొట్టాలలో సర్వే నంబర్ 144–1లో ఉన్న భూమి పంచాయతీదే అని తేల్చారు. ఈ భూమిపై ఓ వ్యక్తి 144–2 అనే తప్పుడు సర్వేనెంబర్ వేసి ఎ.సి.0.0045 సెంట్లు విక్రయించారు. ఈ స్థలం తమదేనని జావేద్ కుటుంబ సభ్యులు అధికారులతో వాదించారు. దీంతో మండల సర్వేయర్‌తో కొలతలు వేయించగా ఆ స్థలం పంచాయతీదేనని తేలిందని పంచాయతీ కార్యదర్శి అశ్వర్థనాయుడు బుధవారం పేర్కొన్నారు.